సీఎంకు సాదర స్వాగతం



కంకిపాడులో గురువారం రాత్రి జరిగిన మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) మేనకోడలు వివాహ వేడుకకు హాజరైన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న కలెక్టర్ రాజాబాబు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్లుప్తంగా

ఎన్నికల సంఘం నిబంధనలు పాటించండి

కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఈవీఎంల మొదటిదశ పరిశీలన కార్యక్రమంలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌లో గురువారం నిర్వహించిన ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌ల మొదటిదశ పరిశీలన కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశీలన కార్యక్రమంలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలన కార్యక్రమంలో ప్రతి రోజూ పాల్గొని సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ నాగేశ్వర నాయక్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ సురేష్ పాల్గొన్నారు.

25 నుంచి గ్రామ సభలు

పెడన: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను గుర్తించేందుకు ఈ నెల 25 నుంచి నవంబర్ 8వ తేదీ వరకు పంచాయతీలలో గ్రామసభలు నిర్వహిస్తామని ఏపీఓ ముత్యాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసభలు ఆయా గ్రామాలలో ఎప్పుడు, ఎక్కడ నిర్వహించేది పంచాయతీ కార్యాలయంలో తెలియజేస్తామన్నారు.

శివరామకృష్ణ క్షేత్రానికి విరాళం

కోడూరు: కోడూరులో నూతనంగా నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి కోడూరుకు చెందిన అన్నం కృష్ణమోహన్-రాధారాణి దంపతులు రూ.50,116 విరాళంగా కమిటీ సభ్యులకు గురువారం అందించారు. పూర్తి గ్రానైట్‌తో నిర్మిస్తున్న ఆలయానికి తమవంతు సహాయం అందించడం ఆనందంగా ఉందని దాతలు తెలిపారు. కమిటీ సభ్యులు అన్నం వెంకట సుబ్బా రావు, బూరగడ్డ హరినాథ్‌బాబు, జూపూడి సుభాష్ చంద్రబోస్, అన్నం శివరామకృష్ణ, తూనుగుంట్ల మహేష్, అన్నం సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో చెత్త తొలగింపు

బోడగుంట(మోపిదేవి): స్వచ్ఛ భారత్‌లో భాగంగా గ్రామాన్ని స్వచ్ఛ సుందరంగా తీర్చిదిద్దేందుకు యువత ముందుకురావడం అభినందనీయమని మోపిదేవి-2 ఎంపీటీసీ కొమ్ము పవన్‌కుమార్ అన్నారు. మోపిదేవి-2 బోడగుంట దళితవాడలో గురువారం రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్లకంపను తొలగించి, చెత్తపై కలుపుమందు చల్లి, రహదారులను శుభ్రం చేశారు. యువకులు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి కుంకుమార్చన

మచిలీపట్నంటౌన్: నగరంలోని గీతామందిరంలో కోటి కుంకుమార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన కోటి కుంకుమార్చన కార్యక్రమం ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్నారు. కోటి కుంకుమార్చన పూజలో పాల్గొంటున్న మహిళలకు నిర్వాహకులు ప్రతి రోజూ మధ్యాహ్నం అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు.

బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామచంద్రరావు

మచిలీపట్నంటౌన్: బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా లంకపల్లి రామచంద్రరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలోని ఈడేపల్లిలో గురువారం జరిగిన అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో రామచంద్రరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ అలీ అజ్మతుల్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చేబ్రోలు శరత్‌చంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రామచంద్రరావును సంఘ నాయకులు అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చల్లపల్లి: చల్లపల్లి ప్రధాన కూడలిలో ఈనెల 17న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిన ఘటనకు సంబంధించి క్షతగాత్రుల్లో ఒకరు మృతి చెందారు. చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీకి చెందిన పసుపులేటి చిన సాంబయ్య (58) విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ప్రమాద సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద నిలబడి ఉన్న చిన సాంబయ్యపై ట్రాన్స్‌ఫార్మర్‌లో నుంచి ఆయిల్, మంటలు పడి కాలిపోయాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా రెండు కళ్లు, చెవి కోల్పోయాడు. చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జగమేలు తల్లికి జేజేలు

- ఐదో రోజుకు చేరిన శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- వివిధ రూపాల్లో అమ్మవార్ల దర్శనం

కోడూరు: అవనిగడ్డ, పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లకు వివిధ అలంకారాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఐదో రోజు గురువారం అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కోడూరు గంగాభవానీ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అమ్మవారి దర్శనానికి మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సంతమార్కెట్ సమీపంలోని కనకదుర్గమ్మ అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించారు. బంతిపూలతో చేసిన అలంకారం ఆకట్టుకుంది. నరసింహపురంలో నెలకొల్పిన దుర్గమ్మ విగ్రహానికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. కోడూరు పార్వతి, దానాశక్తి, లింగారెడ్డిపాలెం బాలాత్రిపుర సుందరీదేవి, మాచవరం తుంగపల్లెమ్మ, విశ్వనాథపల్లి, మండపాకల అద్దంకి నాంచారమ్మ, ఉల్లిపాలెం, హంసలదీవి రాజ్యలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

- **నాగాయలంక:** నగరేశ్వరస్వామి దేవస్థానంలో కన్యకాంబకు విశేష అభిషేకాలు జరిపారు. అమ్మవారి ఉత్సవమూర్తికి పసుపు, కుంకుమలు, పంచామృతాలతో అభిషేక పూజలు జరిపి హారతులు, మంత్ర పుష్ప నీరాజనాలు సమర్పించారు. నాగాయలంక సంకర్షణ భజన మండలి మహిళలు చిట్టావాణి నేతృత్వంలో శ్రీలలిత, శ్రీలక్ష్మీ సహస్ర నామ సామూహిక పారాయణం జరిగింది.

రాజరాజేశ్వరీదేవిగా దుర్గమ్మ..

మోపిదేవి: మోపిదేవి గొడపాలెం రామాలయం వద్ద మహిళలు ఏర్పాటు చేసిన దుర్గమ్మకు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. పెదకళ్లేపల్లిలోని దుర్గా, పార్వతి సమేత నాగేశ్వరస్వామి వారి దేవస్థానంలో చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఏసీ ఎస్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గమ్మను రాజరాజేశ్వరీదేవిగా అలంకరించారు. కొక్కిలిగడ్డలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో అమ్మవారిని రాజరాజేశ్వరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, సువాసినీలచే సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.



మహాచండీదేవిగా కోడూరు కనకదుర్గమ్మ



నరసింహపురంలో మహా చండీదేవిగా దుర్గమ్మ




మహా చండీదేవిగా నాగాయలంక కనకదుర్గమ్మ



నాగాయలంకలో మహా చండీదేవిగా పార్వతీదేవి



పెడనలో బాలాత్రిపురసుందరీదేవిగా వాసవి మాత



ఇష్టకామేశ్వరి దేవిగా పెడన పైడమ్మ అమ్మవారు



బందరులో సంతానలక్ష్మీదేవిగా కన్యకా పరమేశ్వరి అమ్మవారు



బందరులో మహాచండీదేవిగా పార్వతీదేవి



గూడూరు మహాలక్ష్మీ ఆలయంలో ధాన్యలక్ష్మీగా అమ్మవారు

- **నాగాయలంక:** స్థానిక నగరేశ్వరస్వామి వారి దేవస్థానంలో పార్వతీదేవి మహా చండీదేవి అలంకారంలో, శ్రీవాసవీ కన్యాకా పరమేశ్వరి అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నాగాయలంక కృష్ణానది ఒడ్డున కొలువైన కనక దుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారు మహా చండీదేవి అలంకారంలో పూజలందుకున్నారు. గణపేశ్వరం దుర్గా, గణపేశ్వరస్వామి ఆలయాలలో దుర్గమ్మ మహాలక్ష్మీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భావదేవరపల్లిలోని అన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో లలితా త్రిపుర సుందరి దేవిగా, అంకాల దేవర దేవస్థానంలో మహా చండీ దేవిగా అమ్మవార్లను తీర్చిదిద్దారు.
- **పెడన:** పెడనలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గురువారం ఐదో రోజు వాసవి మాత బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి. సాయంత్రం జ్యోతుల పూజ, కుంకుమార్చన నిర్వహించారు. పట్టణ వాసవి మహిళా మండలి వారు లలితా పారాయణం చేశారు. ఈ సందర్భంగా మచిలీపట్నానికి చెందిన సింగరాజు దివాకర్‌చే ఏర్పాటు చేసిన వెంకటేశ్వర స్వామి మహిమలు (ప్రవచనాలు) భక్తులను ఆకట్టుకున్నాయి. పట్టణంలోని పైడమ్మ అమ్మవారిని ఇష్టకామేశ్వరిదేవిగా అలంకరించారు.

అన్నపూర్ణాదేవిగా దర్శనం

మచిలీపట్నంటౌన్: బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో అమ్మవారు ధనలక్ష్మీదేవిగా, అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. రాబర్ట్‌సన్‌పేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారికి పూజలు చేశారు. ఉదయం, సాయంత్రం కుంకుమార్చనలు జరిగాయి. కన్యకా పరమేశ్వరి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారు మహాచండీదేవిగా, కన్యకా పరమేశ్వరి అమ్మవారు సంతానలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మాతృ అర్చన జరిగింది. రాత్రికి సీహెచ్ పూర్ణచంద్రిక భరత వేదమున పాటకు చేసిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. గుడివాడకు చెందిన పొదర్తి సిస్టర్స్ వారి శిష్య బృందం చేసిన కూచిపూడి నృత్యం, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆజాద్‌రోడ్డులోని గీతా మందిరంలో వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు ధనలక్ష్మీదేవిగా, లలితా అమ్మవారు అష్టలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సౌందర్యలహరి పారాయణ చేశారు. రాజుపేటలోని భ్రమరాంబ సమేత రాజమౌళీశ్వరస్వామి మందిరం (ముచ్చింగుడి) అమ్మవారు గాయత్రీదేవిగా పూజలందుకున్నారు. రాత్రికి అల్ ఇండియా రేడియో, టీవీ ఆర్టిస్ట్ భద్రయ్య, తరకటూరి వీరాంజనేయులు బృందం కచేరి ఆకట్టుకుంది. ఈడేపల్లిలోని శక్తిగుడి, ప్రధాన రహదారిలోని విజయదుర్గాదేవి ఆలయం, రేవతి సెంటర్‌లోని గంగానమ్మగుడి తదితర ఆలయాల్లో పూజలు చేశారు.

- **గూడూరు:** గూడూరులోని గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు కాశీ అన్నపూర్ణా దేవిగా దర్శనమిచ్చారు. గూడూరులోని మహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ధాన్యలక్ష్మీ దేవిగా పూజలందుకున్నారు. ద్వారకా నగర్‌లోని రామాలయంలో అమ్మవారు ధనలక్ష్మీదేవిగా దర్శనమివ్వగా, ఐదుగుళ్లపల్లి శివాలయంలో మహాలక్ష్మీ దేవి రూపంలో అలంకరించారు. వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకున్న భక్తులు కుంకుమ పూజలు, విశేష పూజలు నిర్వహించారు.



బందరులో అర్చనలో పాల్గొన్న మహిళలు



నడకుదురులో అమ్మవారి అలంకరణ



జానకీరామపురంలో అమ్మవారి అలంకరణ

- **బంటుమిల్లి:** స్థానిక కనకదుర్గ ఆలయం, పాశ్వాపురం ఆంజనేయస్వామి ఆలయంలో లలిత త్రిపుర సుందరీదేవీగా, పెదతుమ్మిడి శివాలయంలో మహాలక్ష్మీదేవీగా, బంటుమిల్లి పద్మావతి, గోదా సమేత వెంకటేశ్వరస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయాల్లో సంతానలక్ష్మీ దేవీగా అమ్మవార్లు దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. లక్ష్మీనారాయణపురం, జానకీరామపురం, మల్లంపూడి, ముంజులూరు తదితర గ్రామాల్లో అమ్మవారి ప్రతిమలను నిలిపి కుంకుమ పూజలు నిర్వహించారు.

- **నడకుదురు(చల్లపల్లి):** నడకుదురులోని ప్రాచీన శైవక్షేత్రం పృధ్వీశ్వర స్వామి దేవస్థానంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో లలితా పంచమి సందర్భంగా బాలా త్రిపుర సుందరీదేవి అమ్మవారికి రజత కవచ అలంకరణ చేశారు. అమ్మవారికి పంచామృత అభిషేకం, స్వామివారికి రుద్రాభిషేకం, భక్తులచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. చల్లపల్లి తూర్పు వీధి రామాలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. నిమ్మలతోటలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద మాలికా పురోత్తమకు భగవతి రూపంలో అలంకరించారు. కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో లలితా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు దర్శమిచ్చారు.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి ప్రతి పేదవాడికి కార్పొరేట్ తరహా వైద్యం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. గురువారం మండలంలోని పిట్టల్లంక సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని రమేష్‌బాబు ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వివిధ విభాగాలకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులతో గ్రామ స్థాయిలోనే ఉచితంగా వైద్య సేవలందిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్, 104, 108, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా వైద్యసేవలందిస్తున్నామని, కొత్తగా రూపకల్పన చేసిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరంలాంటిదన్నారు. అనంతరం వైద్య నిపుణులతో మాట్లాడి పూర్తి స్థాయిలో సేవలందించాలని సూచించారు. శిబిరానికి వచ్చిన ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ ఆరోగ్యం గురించి ప్రత్యేక శ్రద్ధ వహించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం చాలా బాగుందని గ్రామస్తులు రమేష్‌బాబు వద్ద తమ సంతోషం వ్యక్తం చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం రోగులకు మందులను ఉచితంగా అందజేశారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి ఇంకొల్లు శేషగిరిరావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ షేక్ లతీఫ్ పాషా పాల్గొన్నారు.

- **పెడన:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైద్య సేవలు చేరువయ్యాయని, గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించాయని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. చోడవరంలో గురువారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 226 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు, పెనుమల్లి సర్పంచ్ గరికపాటి వెంకట రామానాయుడు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు దావు భైరవలింగం, ఎంపీటీసీ ఊచా ఆదిసూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పిట్టల్లంకలో రోగులకు మందుల కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



చోడవరం శిబిరంలో మందులు అందజేస్తున్న అచ్యుతరావు, రామానాయుడు

పేదల ఆరోగ్య భద్రతకు పెద్దపీట..

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని పేద ప్రజల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. నగరంలోని 27, 39 డివిజన్లలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను మేయర్ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి కుటుంబానికి మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యాన్ని చేరువ చేశారని తెలిపారు. శిబిరంలో పాల్గొన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. 27వ డివిజన్‌లో జరిగిన వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ ఎండీ సదురుద్దీన్, కార్పొరేటర్ గోపిశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

709 మందికి వైద్య పరీక్షలు..

గూడూరు: గూడూరు మండలం కప్పలదొడ్డిలో జరిగిన వైద్య శిబిరంలో 709 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మల్లవోలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ వి.రాజీవి, గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య నిపుణులు డాక్టర్ హరిరంగ ప్రసాద్, అప్తాలమిక్ అసిస్టెంట్ అనిల్ వైద్య సేవలు అందించారు. గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు శిబిరాన్ని ప్రారంభించగా సర్పంచి యక్కల మాధవి, ఎంపీటీసీ పేరిశెట్టి తేజోవతి, వైఎస్సార్ సీపీ నాయకులు పర్లం మహాలక్ష్మయ్య నాయుడు, యక్కల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

- **బంటుమిల్లి:** పెందుర్రు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎంపీపీ వి. చినబాబు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. 652 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వీరిలో ఆరుగురిని మెరుగైన వైద్యం కోసం మచిలీపట్నం, విజయవాడ ఆస్పత్రులకు సిఫార్సు చేశారు. పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె. రాజ్యలక్ష్మి శిబిరాన్ని సందర్శించారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ టి. శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాదాసు లక్ష్మీశకుంతల, తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, ఎస్. మహేష్, నాయకులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం జగన్

పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సంక్షేమానికి పలు పథకాలను అమలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 46వ డివిజన్ శ్రీనివాసనగర్, పంచాయతీ రాజ్ కాలనీ, రామ్‌నగర్, బాబాసెంటర్ తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరొందారన్నారు. నవరత్న పథకాలతో ప్రతి కుటుంబానికి పెద్దన్నలా జగన్ వ్యవహరిస్తున్నారని చెప్పారు. డ్రెయిన్ల ద్వారా మురుగునీరు పారేలా చర్యలు తీసుకోవాలని, గృహాల మధ్యలో ఉన్న ఖాళీస్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి మెరక చేయించాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బోగాది సాయిబాబు, కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, కార్పొరేటర్లు జోగి చిరంజీవి, పరింకాయల విజయ్, యండ్రపాటి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వీఏఎస్ మూర్తి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు షేక్ జలీల్, నాయకులు ధనికొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి నరసింహారావు

అవనిగడ్డ: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తోందని వైఎస్సార్ సీపీ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా తీరప్రాంత పొలాలకు సాగునీటి సమస్య తలెత్తిందన్నారు. చివరి భూములకు కూడా నీటిని మళ్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. 60 శాతం పంట కాలువలపై, మరో 40 శాతం వర్షంపై ఆధారపడి పంటను సాగు చేస్తారని, అయితే వర్షాలు కురవకపోవడంతో పూర్తిగా కాలువ నీటి పైనే ఆధారపడి రైతులు పంట సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కోడూరు, నాగాయలంక మండలాల్లోని చివరి భూముల్లో పొలాలు అక్కడక్కడ మాత్రమే దెబ్బతిన్నాయని, సాగునీటి సమస్యను పూర్తిగా అధిగమించేందుకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఇరిగేషన్ అధికారులతో కలిసి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ ఏడాది కూడా పంటలు బాగా పండుతాయన్నారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మాజీ సర్పంచి సైకం బాబురావు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న నరసింహారావు

బీసీ సంక్షేమ సంఘం నేతల హర్షం

మచిలీపట్నంటౌన్: బీసీలు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న కులగణనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించడంపై సంఘ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సంఘం తరఫున సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని సంఘ కార్యాలయంలో గురువారం శేకుబోయిన మాట్లాడారు. సీఎం జగన్ బీసీలకు ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు పలు అంశాల్లో అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. బీసీల అభ్యున్నతే ధ్యేయంగా చట్ట సభల్లో 65 శాతానికి పైగా వాటా ఇచ్చారన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చరిత్ర సృష్టించారని చెప్పారు. కులగణన ఆధారంగా బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యతో కలిసి తాము ఉద్యమించామన్నారు. బీసీల శత వసంతాల కులగణన కలను సాకారం చేస్తున్న ముఖ్యమంత్రికి బీసీ సంక్షేమ సంఘం నాయకులంతా కృతజ్ఞతలు తెలుపుతూ ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు నిక్కు రాధాకృష్ణ, ఎల్ఐసీ రాంబాబు, చేబోయిన కోటేశ్వరరావు, పామర్తి బాల, ఎం. పవన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్రెండ్లీ పోలీస్ ఏర్పాటు చేయాలి

చల్లపల్లి సీఐ నాగప్రసాద్

నాగాయితిప్ప(మోపిదేవి): గ్రామాల్లో ఫ్రెండ్లీ పోలీస్ ఏర్పాటు చేసుకోవాలని చల్లపల్లి సీఐ నాగప్రసాద్ అన్నారు. నాగాయితిప్పలో సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి) అధ్యక్షతన గ్రామపెద్దలతో గురువారం సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ తమ ఫోన్‌లో దిశ యాప్‌ను అందరూ డౌన్ లోడ్ చేసుకోవాలని, అత్యవసర సమయంలో పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఎస్ఐ పద్మ మాట్లాడుతూ గ్రామంలో సచివాలయ మహిళా కానిస్టేబుల్ అందుబాటులోనే ఉంటుందని, ఆమె సేవలను ఉపయోగించుకోవాలని వివరించారు. స్థానికులు మాట్లాడుతూ సాయంత్రం సమయంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, మహిళా కానిస్టేబుల్ లక్ష్మీ, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

23న నాగాయలంకలో బతుకమ్మ సంబరాలు

నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం కమిటీ ఆధ్వర్యంలో మహిళల సమన్వయంతో బతుకమ్మ సంబరాలు ఈనెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, నిర్వహణ ప్రతినిధి తలశిల రఘుశేఖర్ గురువారం తెలిపారు. స్థానిక ప్రసన్న గణపతి దేవస్థానం సెంటర్ నుంచి కృష్ణానది ఒడ్డున శ్రీరామ పాదక్షేత్రం పుష్కరఘాట్ వరకు ఆటపాటలతో బతుకమ్మ సంబరం ర్యాలీ జరుగుతుందన్నారు. అనంతరం కృష్ణానదిలో బతుకమ్మను నిమజ్జనం చేస్తామని చెప్పారు. తెలంగాణ సంప్రదాయ సంస్కృతిని గతంలో మాదిరిగా దివిసీమ తెలుగు ప్రజలకు పరిచయం చేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం జరపాలని నిర్ణయించామన్నారు. దివిసీమ ప్రజలు, బతుకమ్మ వేడుకలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోనేరుసెంటర్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ ఎం. భాస్కర్ గురువారం తెలిపారు. తాళ్లపాలెం, కానూరు, పెదపట్నం, గోకవరం, సిరివెళ్లపాలెం, మంగినపూడి, తపసిపూడి గ్రామాల్లో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

గ్రామ సర్వేయర్ల సమస్యలు పరిష్కరించాలి

చిలకలపూడి(మచిలీపట్నం): సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న గ్రామ సర్వేయర్ల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జి, గోపీచంద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ పలు సమస్యలను జేసీ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నవీన్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

- **ఈకేవైసీ త్వరగా చేయించుకోవాలి**

చల్లపల్లి: రైతులు వెంటనే ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ జి.సాయిసింధు గురువారం ఒక ప్రకటనలో కోరారు. చల్లపల్లి మండలంలో ఈక్రాప్ ప్రక్రియ నూరుశాతం పూర్తయిందన్నారు. ఈకేవైసీ ఇప్పటి వరకు 93 శాతం పూర్తయిందని చెప్పారు. మిగిలిన రైతులు కూడా తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో వీఏఏల వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు.